ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

27-03-2025 మధ్యాహ్నం 1.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మేరకు రాష్ట్రంలో శాసనసభ నియోజక వర్గాలను పెంచాలనీ ముఖ్యమంత్రి A రేవంత్ రెడ్డి సభలో తీర్మానం ప్రవేశపెట్టారు.ప

2. గడచిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కాగ్ నివేదికను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభకు సమర్పించారు.

3. తెలంగాణా మానవ అవయవాల మార్పిడి బిల్లును శాసన సభ ఈ రోజు ఏకగ్రీవంగా ఆమోదించింది.

4. హైదరాబాద్ కంచి గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియను నిలిపివేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు.

**డీలిమిటేషన్:**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన - డీలిమిటేషన్ విధి విధానాలలో మార్పులు చేయాలని , ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మేరకు రాాష్ట్రంలో శాసనసభ నియోజక వర్గాలను పెంచాలనీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. జనాభాలెక్కలకు అనుగుణంగా SC, ST స్థానాలను పెంచాలనీ కేంద్రాన్ని కోరారు. డీలిమిటేషన్ ను కేంద్రం అనుసరిస్తున్న విధానాలు దక్షిణాది రాష్ట్రాలకు నష్టం వాటిల్లని విధంగా చేయాలని అభిప్రాయ పడ్డారు.

----------MSL

**శాసనసభ -కాగ్:**

గడచిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రం వివిధ శాఖలు , పద్దుల ద్వారా ఖర్చు చేసిన ప్రజా ధనానికి సంబంధించి భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ - కాగ్ నివేదికను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభకు సమర్పించారు. CAG నివేదికలో పేర్కొన్న మేరకు రాష్ట్ర రెవెన్యూ మిగులు 2023-24 లో 779 కోట్ల రూపాయలుగా ఉంది. ఇది రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 0.05 శాతంగా ఉందని కాగ్ పేర్కొంది. అయితే ద్రవ్య లోటు , అప్పులు పరిమితిని మించి ఎక్కువగా ఉన్నాయని తప్పు పట్టింది. RBI నియమాల ప్రకారం ద్రవ్య లోటు 3 శాతం వరకు ఉండవచ్చు. అయితే రాష్ట్రంలో ద్రవ్య లోటు 49 వేల 977 కోట్ల రూపాయల మేరకు ఉందని ఎత్తి చూపింది. మరో వైపు స్థూల ఉత్పత్తిలో 33.1 శాతం గరిష్ట పరిమితి కాగా రాష్ట్రం అప్పులు 34.47 శాతం అంటే 5 లక్షల 17 వేల 659 కోట్ల రూపాయలుగా ఉందని కాగ్ స్పష్టం చేసింది. కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా సరళిలో వాస్తు, సేవల రంగంలో 28 శాతం పెరిగి, 7 వేల 206 కోట్లకు పెరిగిందని , ఆదాయంపై పన్ను వాటా 25 శాతం పెరిగి 15 వేల 356 కోట్లకు పెరిగిందని కాగ్ స్పష్టం చేసింది.

-----------MSL

**శాసన సభ- అవయవ మార్పిడి బిల్లు:**

తెలంగాణా మానవ అవయవాల మార్పిడి బిల్లును శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. అవయవ మార్పిడి విషయంలో కొత్త చట్టాన్ని అమలుచేయటానికి ప్రభుత్వం నిబద్ధతతో కట్టుబడి ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ స్పష్టం చేశారు. అవయవ దానానికి సంబంధించి గతంలో ఉన్న విధానాన్ని సవరిస్తూ , 2025 తెలంగాణా మానవ అవయవాల మార్పిడి బిల్లును వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ శాసన సభలో ప్రవేశ పెట్టారు. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం BRS ఈ బిల్లును సమర్థించాయి. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రతిపాదిస్తున్నామని

మంత్రి తెలిపారు. చట్టంలో వచ్చిన మార్పులను రాష్ట్రంలో అమలు చేసి, అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు ఈ బిల్లును -ప్రతిపాదిస్తున్నట్లు పేర్కొన్నారు.

(Soundbyte-దామోదర రాజనరసింహ)

----------MSL

**Add శాసన సభ- అవయవ మార్పిడి బిల్లు:**

ఈ బిల్లును సమర్థిస్తున్నట్లు BRS సభ్యులు హరీష్ రావు సభలో చెప్పారు. అలాగే , అవయవదానం చేసిన వారికి ప్రభుత్వం తరఫున అధికారికంగా అంత్యక్రియలు చేయాలనీ , వారి కుటుంబానికి ప్రభుత్వ పథకాల లబ్ది చేకూర్చాలనీ సూచించారు. అవయవాల కోసం ఎదురుచూస్తున్న వారి జాబితా సుదీర్ఘంగా ఉందనీ , ఇప్పటికే రాష్ట్రంలో అవయవ దానం పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శాసన సభ్యులంతా అవయవ దానం చేసి తమ నియోజక వర్గాల ప్రజలకు ఆదర్శంగా ఉండాలని బీఆర్ఎస్ శాసనసభ్యుడు తారకరామారావు సూచించారు. తమ అవయవాలను దానం చేస్తామని సభ్యులంతా ప్రతిజ్ఞ చేయాలని ఆయన అన్నారు. ఇందుకు అవసరమైన ఒక అవయవదాన శిబిరాన్ని ఏర్పాటు చేయాలని శాసన సభ స్పీకరు గడ్డం ప్రసాద కుమార్ ను కోరారు. ఈ విషయమై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

MSL

**BREAK**

ఆకాశవాణి వార్తలు వింటున్నారు. మరిన్ని updates కోసం హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం "ఎక్స్" handle @ air news_hyd ను ఫాలో అవండి. AIR News Hyderabad YouTube Channel ను సబ్ స్క్రైబ్ చేయండి.

**గోర్ బోలి భాష:**

బంజారా, లంబాడ తెగలు మాట్లాడే గోర్ బోలి భాషను రాజ్యాంగం 8వ షెడ్యూలులో చేర్చాలని ప్రతిపాదిస్తూ ప్రభుత్వం ఒక తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశ పెట్టింది. లిపి లేకపోయినా ,

ఆదిమ జాతుల తొలి తరం భాషల్లో గోర్ బోలి ఒకటని రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. హిందీ తర్వాత 11 రాష్ట్రాల్లో ఎక్కువ మంది ప్రజలు మాటాడే గోర్ బోలి భాషను రాజ్యాంగం 8వ షెడ్యూలులో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యతీసుకోవాలనీ మంత్రి కోరారు. రాష్ట్రంలో 20 లక్షల మంది బంజారాలు గోర్ బోలి భాషను మాట్లాడుతారని చెప్పారు.

(Sound byte-జూపల్లి)

-----------MSL

**కిషన్ రెడ్డి**

హైదరాబాద్ గచ్చిబౌలిలోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి వేలం ప్రక్రియ నిలిపివేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈరోజు బహిరంగ లేఖ రాశారు. ఈ భూమిలో జీవవైవధ్యం నెలకొని ఉందని లేఖలో పేర్కొన్నారు. అనేక వృక్షజాతులు , జంతువులు, సరస్సులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే గతంలో ప్రభుత్వ భూముల అమ్మకాలను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను సైతం లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ఆదాయం పెంచుకొనేందుకు గచ్చి బౌలిలోని 400 ఎకరాల భూములను వేలం వేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం శ్రోతలకు తెలిసిందే.

డెస్క్

**శాసనసభ -ద్రవ్య వినియోగ బిల్లు:**

శాసనసభ 2025 ద్రవ్య వినియోగ బిల్లులపై చర్చను చేపట్టింది. శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈ రోజుతో ముగియనుండటంతో ప్రభుత్వం ఈ బిల్లులను ఈ రోజు ఉభయ శాసన సభల్లో ప్రవేశపెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2025-26 కి సంబంధించి బడ్జెట్ పై సభ ఇప్పటికే చర్చించింది. అలాగే వివిధ శాఖల పద్దులపై కూడా సభలో చర్చ చేపట్టారు.

-MSL

**స్త్రీ నిధి**

2023-24 సంవత్సరానికి స్త్రీ నిధి - మెప్మా రుణాల రికవరీలో 94 శాతంతో రాష్ట్రంలో ఆసిఫాబాద్ జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. హైదరాబాద్ గచ్చిబౌలి లో నిన్న జరిగిన స్త్రీ నిధి 12వ సర్వసభ్య సమావేశంలో మంత్రి సీతక్క చేతుల మీదుగా జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అవార్డు అందుకున్నారు. జిల్లాలో 2023-24 సంవత్సరానికి గాను ఐదు కోట్ల 28 లక్షల రూపాయలు రుణాలు లక్ష్యంగా నిర్ణయించగా , ఏడు కోట్ల 23 లక్షల రూపాయలను మెప్మా స్త్రీ నిధి రుణాలు అందించారు. లక్ష్యానికి మించి ఇచ్చిన రుణాలలో 94 శాతం రికవరీ చేశారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం అధికారులు చేసిన కృషికి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అవార్డు సొంతం చేసుకుంది.

ఆసిఫాబాద్ జిల్లా పిటిసి

**భవన శిథిలాలు**

భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్ లో నిన్న భవనం కుప్పకూలిన ఘటనలో ఇప్పటి వరకు   ఒకరు మృతి చెంది  నట్లు అధికారులు తెలిపారు  . భవనం శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. జేసీబీల సాయంతో సింగరేణి రెస్క్యూ టీం , పోలీసులు శిథిలాలను తొలగిస్తున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ , ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

PTC-B.KGM

**ఐపీఎల్**

ఐపీఎల్ టీ20 18వ సీజన్లో భాగంగా ఈ   రాత్రి  హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ , లక్నో సూపర్ జెయింట్స్ జట్లు పోటీ పడతాయి. మ్యాచ్ రాత్రి 7 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుంది. మ్యాచ్ ఆరంభానికి ముందు ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీత విభావరి ఏర్పాటు చేశారు. ఐపీఎల్ మ్యాచులకు వెళ్లే క్రికెట్

అభిమానుల కోసం ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. వివిధ ప్రాంతాల నుంచి ఉప్పల్ స్టేడియానికి వచ్చేందుకు గ్రేటర్ పరిధిలోని 24 డిపోల నుంచి బస్సులు నడుపుతారు.

డెస్క్

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ విభాగం తెలిపింది.

ప్రెస్ నోట్

**ఎండ్**

ఆకాశవాణి వార్తలు ఇంతటితో సమాప్తం. తిరిగి సాయంత్రం 6 గంటల 10 నిమిషాలకు ప్రాంతీయ వార్తలు వింటారు.